ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM






సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 336 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
మంగళవారం 08 జూలై 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# మొబైల్‌లో ఈ యాప్ ఉంటే..

# పోస్టాఫీస్ మీ ఇంట్లో ఉన్నట్లే

పి.నజీర్ అహమ్మద్ కర్నూలు బ్యూరో




## పోస్టల్ సేవలు ఇక మన చేతిలోనే..

### నగదు పొందవచ్చు, పోస్టల్ స్టాంపులు తీసుకోవచ్చు

### పోస్టాఫీసులో ఉన్న పథకాల గురించి తెలుసుకోవచ్చు

**జూలై 9, (రిపబ్లిక్ న్యూస్):** పోస్టాఫీస్ అంటేనే పెట్టుబడి, భద్రతకు పెట్టింది పేరు. 'తపాలా'లో చాలా పథకాలు అమలులో ఉన్నా సరైన సమాచారం తెలియక సామాన్య ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో సేవలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తపాలా విభాగం డిజిటల్ వైపు మళ్లుతోంది. అందులో భాగంగానే 'పోస్ట్ ఇన్ఫో' పేరుతో తపాలాశాఖ కొత్త మొబైల్ యాప్ తీసుకొచ్చింది.

**తపాలా శాఖ ఆరోగ్య బీమా:** తక్కువ ప్రీమియంలో నివా, ఆదిత్యబిర్లా వంటి తదితర సంస్థల సహకారంతో ఈ పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ బీమా తీసుకునేందుకు వయసు 18 - 60 మధ్య ఉన్న వారు అర్హులు. దీనిలో భాగంగా రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకూ పొదుపు చేసుకోవడం వల్ల ప్రమాద బీమానూ పొందవచ్చు. అయితే ఖర్చు రూ.20 లక్షలు దాటితే వైద్య పరీక్షల నివేదికలు జత చేయాల్సి వస్తుంది. పాలసీ ప్రకారం ప్రీమియం ఉంటుంది.

**జీవిత భాగస్వామికి సైతం:** ఉదాహరణకు రూ.10 లక్షలు పొదుపు చేసుకునే విధంగా ఈ పథకంలో చేరితే రూ.10 లక్షల ప్రమాద బీమాతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ.42 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.52 వేలు బోనస్‌గా చెల్లిస్తారు. దంపతుల్లో ఎవరైనా ఒక్కరు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌కు అర్హులు అయితే జీవిత భాగస్వామికి సైతం ఈ పథకం వర్తిస్తుంది.




**పథకాల సమాచారం:** పోస్టాఫీసులో అందుబాటులో ఉన్న పొదుపు పథకాల గురించి ప్రత్యేక తపాలా యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. సుకన్య సమృద్ధి యోజన రికరింగ్ డిజిటల్ స్కీమ్‌కి సంబంధించి సంవత్సరం నుంచి అయిదేళ్ల వరకు చేసే ధరావత్తులపై ఆదాయాన్ని లెక్కించుకోవచ్చు. ప్రస్తుతం అమలులో ఉన్న వడ్డీ రేట్ల ఆధారంగా పథకాలను ఎంచుకొని డిపాజిట్ చేయడంతో వచ్చే ఆదాయ వివరాలను సులువుగా తెలుసుకోవచ్చు.

**ఇంటికే వచ్చి సేవలు:** పోస్ట్ ఇన్ఫో యాప్ ద్వారా నగదు పొందవచ్చు. పోస్టల్ స్టాంపులు తీసుకోవచ్చు. సర్వీస్ రిక్వెస్ పెడితే ఇంటికే వచ్చి ఆయా సేవలు అందిస్తారు. తపాలా బీమా పథకాలు పొందాలనుకుంటే బీమా పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలి. ఇంటికే వచ్చి బీమా ప్రక్రియను పూర్తిచేస్తారు.

**స్పీడ్ పోస్ట్ వివరాలు:** విదేశాలు, దూరప్రాంతాలకు పంపించాల్సిన వస్తువులు, స్పీడ్ పోస్టల వివరాలను సులభంగా తెలుసుకునే సదుపాయం ఉంటుంది. బరువు, దూరాన్ని బట్టి ఎంత ఛార్జి తీసుకుంటారు అనే సమాచారాన్ని యాప్‌లో పొందుపరిచారు. పోస్టు ద్వారా పంపిన ఉత్తరాలు, వస్తువులు ఎక్కడి వరకు చేరాయి? ఏ సమయంలో చేరుకుంటాయి? తదితర సమాచారాన్ని ట్రాకింగ్ చేస్తూ తెలుసుకోవచ్చు.

**ఫిర్యాదుల నమోదు:** తపాలా సేవల్లో లోపాలపై యాప్‌లోని కంప్లైంటు విభాగంలో ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదు చేసిన తర్వాత వచ్చిన నంబరు ఆధారంగా ట్రాకింగ్ ద్వారా కంప్లైంట్ స్థితిని తెలుసుకోవచ్చు. పోస్టల్ సర్వీసులపై ఖాతాదారులు తమ అభిప్రాయాలను వెల్లడించేందుకు ఫీడ్ బ్యాక్ ఆప్షన్ కూడా ఉంది.

**రూ.లక్ష వరకు అందజేస్తారు:** ఆదిత్య బిర్లా సహకారంతో పర్సనల్, గ్రూప్ విభాగాల్లో ఆరోగ్య బీమాను తీసుకోవచ్చు. ఈ ప్లాన్ 18 నుంచి 65 సంవత్సరాల వారికి వర్తిస్తోంది. దీనిలో రూ.549 ప్రీమియం చెల్లిస్తే రూ.10 లక్షల బీమా, రూ.749 ప్రీమియంతో రూ.15 లక్షల పాలసీ తీసుకోవచ్చు. ఏదైనా ప్రమాదంలో చనిపోయిన, శాశ్వత వైకల్యం, అంగవైకల్యానికి పూర్తి ఇన్సూరెన్స్ చెల్లిస్తారు. వైద్య ఖర్చులకు రూ.30 - 60 వేల వరకు అందజేస్తారు. విరిగిన ఎముకల చికిత్సకు రూ.లక్ష వరకు ఇస్తారు. పాలసీదారుడు ప్రమాదవశాత్తు చనిపోతే ఇద్దరు పిల్లలకు గరిష్ఠంగా రూ.లక్ష వరకు చెల్లిస్తారు.

# 200 కంపెనీలకు మెయిల్లు..

## వైకాపా కుట్రలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం

**అమరావతి, జూలై 9, (రిపబ్లిక్ న్యూస్):** ఏపీకి పెట్టుబడులు రాకుండా అడ్డుకునేందుకు వైకాపా చేస్తున్న కుట్రలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేలా వివిధ సంస్థలకు మెయిళ్లు పెట్టడాన్ని సీఎం తీవ్రంగా పరిగణించారు.

పెట్టుబడులను అడ్డుకునేందుకు వైకాపా చేస్తున్న కుట్రలను మంత్రివర్గ సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. ఏపీఎండీసీ బాండ్లలో పెట్టుబడులు పెట్టొద్దని 200 కంపెనీలకు ఈ-మెయిళ్లు పెట్టారని తెలిపారు. వైకాపా కుట్రలపై విచారణ చేయిస్తామని మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రకటించారు.

**మంత్రులు సంతృప్తికరంగా పనిచేయడం లేదు:** మంత్రులెవరూ సంతృప్తికరంగా పనిచేయడం లేదని మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మహిళా ఎమ్మెల్యేను కించపరిచేస్తే ఎందుకు స్పందించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. జరుగుతున్న పరిణామాలపై ప్రతి మంత్రీ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏడాది వ్యవధిలో నిత్యావసరాల ధరలు గణనీయంగా తగ్గించామని సీఎం చెప్పారు. ప్రజలకు లబ్ధి చేకూర్చడంలో మంత్రివర్గ ఉపసంఘం బాగా కృషి చేసిందన్నారు. చేసిన మంచిని ప్రజలకు చెప్పడంలో విఫలమయ్యారని చంద్రబాబు ఆక్షేపించారు. జగన్ కుట్రలను ఎక్కడికక్కడ తిప్పికొట్టాలన్నారు.



# దిల్లీ పర్యటన ముగించుకొని

## హైదరాబాద్‌కు చేరుకున్న సీఎం రేవంత్

**హైదరాబాద్, జూలై 9, (రిపబ్లిక్ న్యూస్):** సీఎం రేవంత్ రెడ్డి దిల్లీ పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు చేరుకున్నారు. రెండు రోజుల పాటు ఆయన ఢిల్లీలో పర్యటించారు. కేంద్ర మంత్రులు మన్సుఖ్ మాండవీయ, పీయూష్ గోయల్, జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. వరంగల్ విమానాశ్రయానికి ఆర్థిక సహాయం చేయాలన్నారు. రాష్ట్రానికి సకాలంలో ఎరువులు సరఫరా చేయాలని కోరారు. 'ఖేలో ఇండియా', '40వ జాతీయ క్రీడలు' నిర్వహణకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



# జగన్ పర్యటనలో మరోసారి ఉద్రిక్తత..

## కాన్వాయ్ నుంచి జారిపడిన వైకాపా నేత

**బంగారుపాళ్యం, జూలై 9, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా అధినేత వైఎస్ జగన్ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం పర్యటనను వైకాపా నేతలు ఎప్పటిలా బలప్రదర్శనకు వేదికగా మార్చారు. బుధవారం ఉదయం బెంగళూరు నుంచి అరగొండ ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు జగన్ చేరుకున్నారు.

అక్కడ 30 మందికి అనుమతి ఉండగా వందలాది మంది దూసుకురావడంతో తోపులాట జరిగింది. రోడ్ షో, ర్యాలీకి అనుమతి లేనప్పటికీ.. హెలిప్యాడ్ నుంచి మార్కెట్ యార్డు వరకు పెద్ద సంఖ్యలో వాహనాలతో రోడ్ షో నిర్వహించారు. ఆంక్షలు ఉల్లంఘించి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. దీంతో పోలీసులు స్వల్ప లాఠీఛార్జ్ చేశారు. ఈ క్రమంలో కాన్వాయ్ నుంచి వైకాపా నేత విజయానంద రెడ్డి జారిపడ్డారు.



## రెచ్చిపోయిన వైకాపా శ్రేణులు

అనుమతులు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చిత్తూరు ఎస్పీ మణికంఠ హెచ్చరించినా వైకాపా శ్రేణులు ఖాతరు చేయలేదు. పోలీసులు ఆదేశాలను ధిక్కరించి ఇష్టా రాజ్యంగా రోడ్ షో నిర్వహించారు. బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో జగన్ తో మాట్లాడేందుకు 500 మందికి పోలీసులు అనుమతిచ్చారు. కానీ, జగన్ రాకముందే వైకాపా కార్యకర్తలు భారీగా మార్కెట్ యార్డులోకి చొచ్చుకెళ్లారు. దీంతో బంగారుపాళ్యంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. వైకాపా నేతలు ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రజలను తరలించారు. సత్యసాయి, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో జగన్ పర్యటనల్లో జరిగిన సంఘటనల నేపథ్యంలో జగన్ పర్యటన మరోసారి చర్చనీయాంశంగా మారింది. రైతులకు పరామర్శ కాదు.. దండయాత్రలా ఉందని పలువురు తెదేపా నేతలు విమర్శిస్తున్నారు.





## మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి:జగన్

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సీఎం జగన్ కోరారు. "మా ప్రభుత్వ హయాంలో కిలో మామిడి రూ.29కి కొన్నాం. రైతులకు కనీసం రూ.12 కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారా? కర్ణాటకలో రూ.16కు కొనుగోలు చేస్తున్నారు. మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. వారి తరపున వైకాపా పోరాటం చేస్తుంది." అని తెలిపారు.

# డిసెంబర్ నాటికి అమరావతి

## క్వార్టర్స్‌లోకి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు:అయ్యన్నపాత్రుడు

**అమరావతి, జూలై 9, (రిపబ్లిక్ న్యూస్):** ఈ డిసెంబర్ నాటికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాజధాని అమరావతి క్వార్టర్స్‌నే ఉంటారని ఏపీ శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు అన్నారు. అమరావతిలో నిర్మాణంలో ఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లను ఆయన బుధవారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.



ఈ సందర్భంగా ఆయన అసెంబ్లీలోని ఛాంబర్లో మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడుతూ.. నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని నివాస సముదాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. స్విమ్మింగ్ పూల్, ఆస్పత్రి, క్లబ్ హౌస్ ఉండేలా చూడాలని ఆదేశించారు. సోలార్, గ్రౌండ్ వాటర్ రీఛార్జ్, వేస్ట్ వాటర్ వినియోగం ఉండాలని దిశానిర్దేశం చేశారు. చట్టసభసభ్యుల కోసం మొత్తం 12 టవర్లలో 288 క్వార్టర్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. 35మంది మంత్రులు, 36 మంది న్యాయమూర్తుల క్వార్టర్స్ వచ్చే మార్చి నాటికి అందుబాటులోకి వస్తాయన్నారు. కృష్ణా నది వెంబడి సీఎం అధికారిక నివాసం, రాజ్భవన్ ఉంటాయని తెలిపారు.

## ఆగస్టులో 10 రోజులపాటు వర్షాకాల సమావేశాలు

ఆగస్టులో పది రోజుల పాటు అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు నిర్వహించనున్నట్లు అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. సెప్టెంబర్ 14, 15 తేదీల్లో తిరుపతిలో చట్టసభల జాతీయ మహిళా సాధికార సభ్యుల సదస్సు జరగనున్నట్లు తెలిపారు. ఏపీ ఆతిథ్యం ఇవ్వాలన్న లోక్సభ స్పీకర్ సూచనతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ జాతీయ సదస్సుకు అన్ని రాష్ట్రాల నుంచి దాదాపు 50మంది సభ్యులు పాల్గొంటారన్నారు.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# ఈసారి కనికరం ఉండదు..
## కొత్త చిత్రాన్ని ప్రకటించిన యంగ్ హీరో..



టాలీవుడ్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని వరుస సినిమాలతో అలరిస్తున్నారు యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ. తాజాగా ఆయన మరో కొత్త సినిమాను ప్రకటించారు. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణసంస్థ ఓ ఆసక్తికర పోస్టర్ను పంచుకుంది. 'బడాస్' పేరుతో ఇది రానున్నట్లు తెలిపింది. రవికాంత్ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్పై నాగవంశీ నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది 'బడాస్' విడుదల కానుంది. "మీరు ఇప్పటివరకూ హీరోలను, విలన్లను చూసి ఉంటారు. కానీ, ఇప్పుడు వారికి మించి చూస్తారు. ఈసారి కనికరం లేకుండా ఫైర్ సెట్ చేస్తాడు" అని నిర్మాణ సంస్థ ప్రకటించింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు. మంచి హిట్ కోసం ఎదురుచూస్తున్నారు సిద్ధూ జొన్నలగడ్డ. ఇటీవల 'జాక్' సినిమాతో ప్రేక్షకులను పలకరించారు. అయితే ఆ చిత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ప్రస్తుతం ఆయన 'తెలుసు కదా'లో నటిస్తున్నారు. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. నీరజ కోన దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకురానుంది.

## దేవుడు నన్ను ప్రధానిని చేయడు:కంగనా రనౌత్



తాను రాజకీయ జీవితాన్ని పూర్తిగా ఆస్వాదించలేకపోతున్నానన్నారు ఎంపీ కంగనా రనౌత్. ప్రజలు తన దృష్టికి తీసుకువస్తోన్న సమస్యలపై ఆశ్చర్యం వ్యక్తంచేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తాను ఒకప్పుడు నాస్తికురాలినని తర్వాత ఆధ్యాత్మిక ప్రయాణం వైపు వచ్చానని తెలిపారు. "నేను రాజకీయ జీవితాన్ని ఆస్వాదించలేకపోతున్నాను. ఈ రంగం చాలా భిన్నమైనది. ఇది నా నేపథ్యం కాదు. నేను మహిళల హక్కుల కోసం పోరాడాను. ప్రజలు నా దృష్టికి తీసుకువస్తోన్న సమస్యలు చూసి ఆశ్చర్యం కలుగుతోంది. నేను ఎంపీని.. కానీ, ప్రజలు నా వద్దకు పంచాయతీస్థాయి సమస్యలు తీసుకువస్తున్నారు. రోడ్లు బాగాలేవని చెబుతుంటారు. అది రాష్ట్ర ప్రభుత్వం స్థాయిదని నేను చెప్పినప్పటికీ వారు అర్థం చేసుకోరు. 'మీ సొంత డబ్బును ఉపయోగించి సమస్యను పరిష్కరించండి' అని అంటారు" అంటూ కంగనా అసహనం వ్యక్తంచేశారు. మీరు రాజకీయ రంగంలో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలనుకుంటున్నారా.. ప్రధాని కావాలన్న లక్ష్యం ఏమైనా ఉందా..? అనే ప్రశ్నకు కంగనా సమాధానమిచ్చారు. "నేను భారత ప్రధాని పదవికి సమర్థురాలినని అనుకోవడం లేదు. ఆ కోరిక కూడా నాకు లేదు. దేవుడు నన్ను ప్రధానిని చేయడు. సామాజిక సేవ నా నేపథ్యం కాదు. పూర్తిగా ప్రజాసేవకు అంకితమయ్యే మనస్తత్వం నాది కాదు. నాకు లగ్జరీ సదుపాయాలను అనుభవించాలనే స్వార్థం కూడా ఉంది. నేను జీవించిన జీవితం అలాంటిది. దేవుడు నన్ను ఏ ఉద్దేశంతో ఈ రంగంలోకి పంపాడో నాకు తెలియదు. నా జీవితాన్ని త్యాగం చేసే ఉద్దేశం నాకు లేదు. అలాంటి జీవితం నాకు నచ్చదు" అని కంగనా తెలిపారు. గత కొన్ని రోజులుగా కంగనా వార్తల్లో నిలుస్తోన్న విషయం తెలిసిందే. హిమాచల్ ప్రదేశ్లోని వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ఆమె అక్కడి ప్రజలకు సహాయం చేయడానికి తాను కేంద్ర మంత్రిని కాదని.. విపత్తు నిర్వహణ నిధులు అందించడానికి తన దగ్గర డబ్బు లేదని చెప్పడం రాజకీయంగా దుమారం రేపింది.



## విడుదలకు సిద్ధమైన వివాదాల చిత్రం.. రిలీజ్ ఎప్పుడంటే..?




వర్షా భరత్ దర్శకత్వంలో రూపొందిన విభిన్న కథా చిత్రం 'బ్యాడ్ గర్ల్. ప్రముఖ దర్శకులు వెట్రిమారన్, అనురాగ్ కశ్యప్ నిర్మాతలుగా వ్యవహరించిన ఈ సినిమా పలు వివాదాలు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఎట్టకేలకు ఈ సినిమా సెన్సార్ పూర్తి అయింది. బోర్డు చెప్పినవిధంగా టీమ్ మార్పులు చేయడంతో సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చింది. ఈ క్రమంలోనే ఇది విడుదలకు సిద్ధమైంది. సెప్టెంబర్ 5వ తేదీన ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ టీమ్ పోస్ట్ పెట్టింది. అంజలి శివరామన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రమిది. శాంతిప్రియ కీలక పాత్ర పోషించారు. వర్షా భరత్ ఈ చిత్రంతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. గతంలో ఆమె వెట్రిమారన్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్గా వర్క్ చేశారు. ఆచారాలు, కట్టుబాట్లు పాటించే సంప్రదాయ కుటుంబంలో పుట్టిన రమ్య.. సరైన జీవిత భాగస్వామిని ఎంచుకునే క్రమంలో ఎలాంటి సమస్యలు ఎదుర్కొంది? అనే ఆసక్తికర అంశంతో దీనిని రూపొందించారు. ఫిబ్రవరి 7న ఈ చిత్రాన్ని ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్ డ్యామ్లో ప్రదర్శించగా.. ప్రశంసలు దక్కించుకుంది. అదే సమయంలో సినీ ప్రియుల కోసం ఈ సినిమా టీజర్ను విడుదల చేయగా.. ఇందులోని పలు సన్నివేశాలపై నెటిజన్ల నుంచి అభ్యంతరం వ్యక్తమైంది. ఒక సామాజిక వర్గాన్ని తక్కువ చేసి చూపించేలా ఆయా సన్నివేశాలు ఉన్నాయంటూ పలువురు విమర్శలు చేశారు. దీనిని నిర్మించిన వెట్రిమారన్, అనురాగ్ కశ్యప్పైనా ఆగ్రహం వ్యక్తంచేశారు. విడుదల నిలిపివేయాలన్నారు. దీంతో సెన్సార్ విషయంలో ఆలస్యం ఏర్పడింది.

ప్రజా రిపబ్లిక్ దిన పత్రిక
9948814188,
9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్


## చరిత్రలో నేటి ప్రత్యేకత

- అర్జెంటీనా జాతీయ దినోత్సవం
- 1875: బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ స్థాపించబడింది.
- 1918: భారతీయ తత్వవేత్త ఉప్పులూరి గోపాలకృష్ణ మూర్తి జననం (మ.2007).
- 1920: భారత కమ్యూనిష్టు పార్టీ నేత తమ్మారెడ్డి సత్యనారాయణ జననం.
- 1925: భారతీయ సినిమా దర్శకుడు, నిర్మాత, నటుడు గురుదత్ జననం (మ.1964).
- 1927: తెలుగు సినిమా నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు జననం (మ.2010).
- 1938: తెలుగు రచయిత, గ్రంథాలయ స్థాపకుడు కూరెళ్ల విఠలాచార్య జననం.
- 1966: శాస్త్రీయ సంగీత, సినీ గాయకుడు ఉన్ని కృష్ణన్ జననం. (చిత్రంలో)
- 1969: భారత మాజీ క్రికెట్ క్రీడాకారుడు వెంకటపతి రాజు జననం.
- 1969: భారత వన్యప్రాణి బోర్డు, పులిని జాతీయ జంతువుగా ప్రకటించింది.


అర్జెంటీనా



స్టాక్ ఎక్స్ఛేంజ్


ఉప్పులూరి గోపాలకృష్ణ మూర్తి



గురుదత్


గుమ్మడి వెంకటేశ్వరరావు


కూరెళ్ల విఠలాచార్య


ఉన్ని కృష్ణన్


వెంకటపతి రాజు


పులి



## గొప్ప లక్ష్యం కోసం తారలంతా ఒక్కటై..!



లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్ తో మూడో టెస్టు మ్యాచ్ ఆడేందుకు టీమ్ ఇండియా సిద్ధమైంది. ఇప్పటికే అక్కడికి చేరుకున్న భారత ఆటగాళ్లు ప్రాక్టీస్ కూడా మొదలెట్టేశారు. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజాలతో కలిసి ఓ ఫొటోషూట్లో పాల్గొన్నారు. ఆ ఫొటోను బీసీసీఐ తన సోషల్ మీడియాలో షేర్ చేసింది. భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ 'యూ వుయ్కెన్' ఛారిటీ కోసం వీళ్లంతా ఒక్క చోటుకు చేరారు. ఇందులో సచిన్ తెందూల్కర్, కెవిన్ పీటర్సన్, అజిత్ అగార్కర్, బ్రియాన్ లారా తదితరులు హాజరయ్యారు.

### కోహ్లి ఆసక్తికర వ్యాఖ్యలు..

యువరాజ్ ఛారిటీ నిధుల కోసం నిర్వహించిన చర్చా కార్యక్రమంలో విరాట్ కోహ్లి, రవిశాస్త్రి, డారెన్ గాఫ్, క్రిస్ గేల్ పాల్గొన్నారు. టెస్టు క్రికెట్ నుంచి రిటైర్మెంట్ అయ్యాక తొలిసారి క్రికెట్ స్టార్లతో కలిసి విరాట్ పాల్గొనడం ఇదే తొలిసారి. ఈసందర్భంగా కోహ్లి తన టెస్టు కెరీర్ను ముగించాల్సిన సమయం వచ్చిందని చెప్పేందుకు 'గడ్డం' రంగును ఉదహరిస్తూ చేసిన వ్యాఖ్యలు ఆకట్టుకున్నాయి. "నేను రెండు రోజుల కిందట నా గడ్డానికి రంగు వేసుకున్నా. ప్రతి నాలుగు రోజులకొకసారి మన గడ్డం రంగు మార్చుకోవాలా? వద్దా? అనేది తెలుస్తుంది" అని తన కెరీర్ గురించి ఓ అవగాహన ఉందని కోహ్లి చెప్పకనే చెప్పాడు.

### కోహ్లితో అనుబంధంపై రవిశాస్త్రి

"నిజాయతీగా చెప్పాలంటే నేను ఒకవేళ కోహ్లితో కలిసి పనిచేయకపోతే టెస్టు క్రికెట్లో ఏం జరిగిందో అది సాధ్యమయ్యేది కాదు. మా ఇద్దరి మధ్య ప్రతి విషయంపై స్పష్టత ఉండేది. ప్రతి ఒక్క క్రికెటర్ తన కెరీర్లో ఎదగాలని అనుకోవడం సహజమే. అతడు ఇచ్చినట్లుగా ఎవరూ నాకు మద్దతు ఇవ్వలేదు. ప్రెస్ కాన్ఫరెన్స్లో బుల్లెట్ల లాంటి ప్రశ్నలకు సమాధానం ఇచ్చాడు. నా క్రికెట్ ప్రయాణంలో భాగమైనందుకు ఎప్పుడూ అతడికి రుణపడి ఉంటా" అని మాజీ కోచ్ రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు.

## అందం


జుట్టు కండీషనింగ్ కోసం హెన్నా పెడతారు. దీనిని వాడడం వల్ల జుట్టు షైనీగా, అందంగా, మెరుస్తూ పెరుగుతుంది. అందుకే, రెగ్యులర్గా హెన్నా వాడుతుంటారు. అయితే, హెన్నా వాడేటప్పుడు కొన్ని తప్పులు చేయకూడదు. అవేంటో తెలుసుకోండి.

# జుట్టుకి హెన్నా పెట్టేటప్పుడు ౨౦ శాతం మంది చేసే తప్పులు,
## వీటి వల్లే జుట్టు రాలుతుంది

హెన్నా.. అనేది సహజంగా దొరికే గోరింటాకు మొక్క ఆకుల్ని ఎండబెట్టి పొడిలా చేసి హెన్నాలా వాడతారు. దీనిని వాడడం వల్ల జుట్టు మంచి రంగులోకి వస్తుంది. బర్గండీ, రెడ్ కలర్లోకి మారుతుంది. అంతేకాదు, దీని వల్ల జుట్టుకి కూడా చాలా మంచిది. తెల్లజుట్టు సమస్యతో బాధపడేవారు హెన్నాని కెమికల్ డై బదులు వాడతారు. ఇవి సహజంగా దొరుకుతాయి. ఎలాంటి కెమికల్స్ ఉండవు. కాబట్టి, జుట్టుకి కూడా ఎలాంటి సమస్యలు రావు. అయితే, దీనిని సరైన విధంగానే వాడాలి. లేదంటే చాలా సమస్యలొస్తాయి. మార్కెట్లో లభించే చాలా హెన్నాలలో రకరకాల కెమికల్స్ ఉంటున్నాయి. వీటి వల్ల జుట్టుకి సమస్యలొస్తాయి. మరి మనం చేయకూడని తప్పులేంటో తెలుసుకోండి.



### ఏ కలర్




చాలా మంది కూడా నేడు మార్కెట్లో దొరికే రకరకాల రంగుల హెన్నాలు వాడుతుంటారు. కానీ, ఎప్పుడూ అలా చేయొద్దు. నేచరల్ హెన్నా ఆరెంజ్ రెడీష్ రంగులో ఉంటుంది. దీనినే వాడాలి. అదే విధంగా, ఎప్పుడు కొన్నా కూడా బాక్స్పై ఉన్న పదార్థాలను చదవండి. 100 శాతం నేచరల్ హెన్నానే వాడాలి.

### ఇండిగో, బ్లాక్ హెన్నా వేరు, హెన్నా వేరు




ఇండిగో, బ్లాక్ హెన్నాలు కూడా హెన్నా అనుకుంటారు. కానీ, కాదు. ఇండికి హెన్నాలా డై విడుదల కాదు. కాబట్టి, దీనిని కలిపిన 15 నుంచి 20 నిమిషాలలోపే వాడాలి. ఇండిగోలో ప్రమాదకరమైన పిపిడి లేదని నిర్ధారించుకోండి. ఇది జుట్టు, చర్మానికి అస్సలు మంచిది కాదు.

### ఎంత వాడాలి



హెన్నా ఎంత వాడాలనేది పర్టిక్యులర్గా కొలతలేమీ లేవు. కానీ, మీ జుట్టు పొడవుని బట్టి, మీ జుట్టు ఎంత ఒత్తుగా ఉందనే విషయాన్ని బట్టి ఉంటుంది. మీకు ఎంత హెన్నా పౌడర్ అవసంమో తెలుసుకుని దాని ప్రకారం మాత్రమే తీసుకోవాలి. ఎక్కువగా తీసుకోవద్దు. తక్కువగా వాడొద్దు.

### నిమ్మరసం



చాలా మంది నిమ్మరసాన్ని హెన్నాలో కలిపి వాడుతుంటారు. నిజానికీ, ఇది తప్పనిసరైతే ఏమీ కాదు. హెన్నాలో ఏదైనా లిక్విడ్స్ కలపాలి. నిమ్మరసంలో అసిడిక్ ఉంటుంది. ఇది జుట్టుని డ్రైగా చేస్తుంది. కాబట్టి, ఎక్కువ నిమ్మరసం కాకుండా తక్కువగా వాడండి. నిమ్మరసం బదులు బ్లాక్ టీ, కాఫీలను వాడొచ్చు. చమోమిలే టీ కూడా బెస్ట్ ఆప్షన్.

shutterstock.com · 2470687595

### ఐరన్ బౌల్ వాడడం



స్వచ్ఛమైన హెన్నా పౌడర్ వాడినప్పుడు మీరు స్టెయిన్ లెస్ స్టీల్ గిన్నెలు వాడొచ్చు. కొంతమంది ఐరన్ బౌల్స్ వాడుతారు. దీని వల్ల డై వస్తుందని. ఎక్కువగా రంగు ఉంటుంది. కానీ కొన్నిసార్లు ఇది కూడా అంత మంచిది కాదు. సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. వాటి బదులు మీరు నార్మల్ స్టీల్ గిన్నెలు వాడొచ్చు.

### ఎక్కువగా రాయడం



హెన్నా మంచిదని ఎక్కువగా అప్లై చేస్తే హెయిర్ అండ్ స్కాల్ప్ డ్రైగా మారుతుంది. కాబట్టి, దీని బదులు మీరు మాయిశ్చరైజర్ రాయాలి. దీనికోసం హెన్నాలో కొద్దిగా ఆయిల్, పెరుగు, కండీషనర్ వంటివి రాయొచ్చు. హెన్నా వాడాక కూడా కండీషనింగ చేయండి. మంచి రిజల్ట్స్ ఉంటాయి.

**గమనిక**

నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.